క్లుప్తంగా

అప్రోచ్ రోడ్డులో గోతుల పూడ్చివేత



గ్రావెల్‌తో గోతులు పూడ్చుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

సాక్షి స్పందన

నిడమర్రు: బావాయిపాలెం – గణపవరం మలుపులో అప్రోచ్ రోడ్డు మార్జిన్ కుంగిపోయి ప్రమాదకరంగా ఉందంటూ ఈనెల 17న సాక్షిలో కుంగిన అప్రోచ్ రోడ్డు.. ప్రయాణానికి ఇక్కట్లు శీర్షికతో వెలువడిన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. మంగళవారం కుంగిపోయిన సీసీ రహదారి మార్జిన్ గోతుల్లో మెటల్ మిక్స్ గ్రావెల్ వేసి వాటిని పూడ్చివేసే పనులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ నిడమర్రు ఇన్‌చార్జ్ ఏఈ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రయాణీకులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతానికి మెటల్ గ్రావెల్‌తో పూడ్చుతున్నామని, త్వరలో తారు కలిపిన మెటల్‌తో సీసీ రోడ్డు నుంచి తారు రోడ్డుకు ర్యాంపు నిర్మిస్తామని తెలిపారు.

దాత ఆర్థిక సాయంతో వేదిక నిర్మాణం



దాతల సహకారంతో నిర్మించిన వేదిక

దెందులూరు: ఆకుల నరసింహారావు ఉమా లక్ష్మి ట్రస్ట్ అధినేత శ్రీధర్ అందించిన రూ.లక్షతో ఆర్థిక సహాయంతో దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో వేదిక నిర్మాణం పూర్తయింది. నిర్మాణ పనులను పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరావు గ్రంథా పాలకులు గుల్లపూడి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈసందర్భంగా శ్రీధర్ కుటుంబ సభ్యులకు హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హెచ్‌ఐవీపై మొబైల్ వాహనంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ప్రజలందరూ మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు అన్నారు. మంగళవారం గోపన్నపాలెం గ్రామ పంచాయతీలో ప్రజలకు వైరస్ ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, చికున్ గున్యా, జ్వరం, బర్డ్‌ఫ్లూ, జీబీఎస్ వైరస్, హెచ్‌ఐవీ, కోవిడ్, స్వైన్ ఫ్లూ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. గోపన్నపాలెం గ్రామ కార్యదర్శి స్టాలిన్ బాబు, గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటల్లో పురుగుల నివారణకు అగ్ని అస్త్రం దోహదం

పెదవేగి : ప్రకృతి వ్యవసాయంలో అగ్ని అస్త్రం ఎంతగానో ఉపకరిస్తుందని ప్రకృతి వ్యవసాయ కొప్పాక యూనిట్ ఇన్‌చార్జ్ చందు సత్తిబాబు అన్నారు. పెదవేగి మండలం కొప్పాక యూనిట్‌కి సంబంధించిన సిబ్బందితో కలసి ఆయన సామూహికంగా మంగళవారం 200 లీటర్ల అగ్ని అస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ అగ్ని అస్త్రం వల్ల పంటలకు కలిగే ఉపయోగాలను వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుకు నివారణకు, వరి పంటలో కాండం తొలుచు పురుగు, వివిధ పంటల్లో కనిపించే లద్ది పురుగులను అరికట్టేందుకు అగ్ని అస్త్రం ఉపయోగపడుతుందన్నారు. ఎకరానికి 5 లీటర్ల అగ్ని అస్త్రం ద్రావణాన్ని 100 లీటర్ల నీళ్లు తీసుకుని పిచికారీ చేయాలన్నారు. ఐసీఆర్‌పీలు డీ దుర్గ, బి ప్రియాంక, డీ త్రిలోక్, ఆర్ ఫణి పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ ప్రత్తిపాటి సుశీల మృతి

దెందులూరు: దెందులూరు మాజీ జెడ్పీటీసీ ప్రత్తిపాటి సుశీల సోమవారం రాత్రి కొవ్వలి ఆమె నివాసంలో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఉషా సంస్థల అధినేత డాక్టర్ వీవీ బాలకృష్ణారావు, బూసి ఎఫ్రాయిము తదితరులు సుశీల భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హెల్మెట్ ధరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రతపై స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఫొటోలు, వీడియోలతో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్వా సాగుకు తెగుళ్ల గండం

- రొయ్యలు, చేపలకు వ్యాధులు
- రైతు గుండె గుబేలు
- ప్రభుత్వ నుంచి అందని సహకారం



చెరువులో రొయ్యల పట్టుబడి దృశ్యం

దెందులూరు: ఆక్వానే నమ్ముకున్న రైతులు, రైతు కూలీలు నేడు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో దాదాపు 30వేల ఎకరాల్లో ఆక్వాసాగు చేపట్టారు. 22,500 ఎకరాలకు పైగా చేపల చెరువులు, 7,500 ఎకరాలుపైగా రొయ్యల చెరువులు సాగుపై రైతులు, రైతు కూలీలు ఆధారపడి జీవిస్తున్నారు. పెట్టుబడులు పెరుగుతున్నాయేతప్ప దిగుబడులు రావడం లేదని దీనికితోడు కంపెనీల మధ్య పోటీతత్వం పెరిగి ఫీడ్ సీడ్‌కి రేట్లు అమాంతంగా పెరిగాయి. చేపలు, రొయ్యలకు వ్యాధులు ఆశించడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో దెందులూరు నియోజకవర్గ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల సాగుకు ఒక ఎకరానికి అన్నీ కలిపి రూ.8 నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చవుతుంది. 3 నుంచి 4 నెలలలోపు పంట దిగుబడి వస్తుంది. అన్నీ సక్రమంగా ఉంటే ఎకరానికి రెండున్నర టన్నులు దిగుబడి లభిస్తుంది. చెరువుల్లో చేపల సాగుకు ఒక ఎకరానికి రూ.4 నుంచి రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. 8నెలలనుంచి 10నెలలలోపు చేప తయారీ పూర్తిస్థాయిలో అవుతుంది. ఒక ఎకరానికి అన్ని సక్రమంగా జరిగితే దిగుబడి 5 టన్నుల వరకు రావచ్చు. ఫీడ్ సీడుకు నిర్దిష్ట ధరలు లేకపోవడం, పెట్టుబడులు పెరగటం, దిగుబడులు రాకపోవడం, ఏటా వ్యాధుల నివారణకు ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందకపోవడంతో ఆక్వా సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు అంటున్నారు.

ప్రమాదకరంగా వైరస్ తెగుళ్లు

ప్రస్తుత సీజన్‌లో రొయ్యల్లో డబ్ల్యూ ఎస్ఎస్, వీవీబీ ఈహెచ్‌పీ, ఈఎంఎస్ వైరస్ ప్రమాదకరంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి రెండు వైరస్‌లు పూర్తిస్థాయిలో వస్తే చెరువు మొత్తం ఖాళీ అవుతుందని, మిగిలిన రెండు వైరస్‌లు వ్యాపిస్తే రొయ్య ఎదుగుదల ఉండటం లేదని తీవ్ర నష్టం చవిచూస్తున్నామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. చేపల్లో పేను సమస్య శంకు జలగ ఉండటంతో దిగుబడి అంతంతమాత్రంగానే ఉందని అంటున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టినా వ్యాధులు, వాతావరణం, ధరలు ప్రభుత్వ సహకారం లేకపోవడం, కంపెనీల మధ్య పోటీ తమ పాలిట శాపంగా మారిందని ఆక్వా రైతులు అంటున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఆక్వా రైతులను ఆదుకునేందుకు, సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చేపలకు సోకిన పేను తెగులు



చేపకు సోకిన శంకు జలగ



డబ్ల్యూఎస్ఎస్‌వీ వైరస్ సోకిన రొయ్య

మద్దతు ధర ప్రకటించాలి



ప్రభుత్వం చేపలు, రొయ్యలకు కనీస ధరను ప్రకటించాలి మేత, సీడ్ ధరలు తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులు, కూలీలు, అనుబంధ వ్యక్తుల కుటుంబాలకు మేలు జరిగేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీను, ఆక్వా రైతు, సత్యనారాయణపురం

సబ్సిడీ అందరికీ వర్తింపజేయాలి



విద్యుత్ సబ్సిడీ పథకం అందరికీ వర్తింప చేయాలి పంట కాలువల నిర్వహణ ప్రైవేటుకు ఇస్తామన్న ప్రభుత్వ ఆలోచన సరైంది కాదు. పంట కాలువలు ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి, చేపలు, రొయ్యల రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ధరల పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

– కే శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నాణ్యమైన సీడ్ ఎంపిక ప్రధానం

రొయ్యలకు ఆశించిన నాలుగు రకాల వైరస్‌లు వ్యాపిస్తున్నాయి. రైతులు యాజమాన్య పద్ధతులను విస్మరించడంతో ఈ వైరస్‌లు వ్యాపిస్తాయి. నాణ్యమైన సీడ్ ఎంపిక ప్రధానం. వ్యాధుల నివారణకు మందులు లేవు. చేపలకు సంబంధించి పేను, శంకు జలగ తెగులు నాణ్యమైన నీరు లేకపోవడం వల్ల వ్యాపిస్తాయి. ఆక్వా రైతులు మత్స్య శాఖ ఉద్యోగులను సంప్రదించాలి.

– రాజ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, మత్స్య శాఖ

పాఠశాలల్లో భాషోత్సవాలు ప్రారంభం

భీమడోలు: ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో భాషోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో మంగళవారం ఇంగ్లీషు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ పర్యవేక్షణలో టీచర్ల బృందం ఆధ్వర్యంలో 1, 2వ తరగతి విద్యార్థులు పద్యాల పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఇంగ్లీషు అక్షరమాలను ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. కథలు చదవడం, వ్యాసరచన, స్పెల్ బీ, రోల్‌ప్లే నిర్వహించారు. టీఎల్‌ఎం ప్రదర్శన ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులను అందించారు.

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుల విగ్రహాల ఆవిష్కరణ

దెందులూరు: విద్యతోపాటు అనేక కుటుంబాల అభివృద్ధికి రిటైర్డ్ హెచ్‌ఎం పి.చార్లెస్, రిటైర్డ్ టీచర్ జేసు కరుణ దంపతులు చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పెదపాడు ఆర్‌సీఎం చర్చిఫాదర్ పి. మిల్కీ ఇయర్ అన్నారు. దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్ రాజా, ఫాదర్ మేక పాస్కాలి, ఫాదర్ రాజుతో కలిసి తల్లిదండ్రులైన రిటైర్డ్ హెచ్‌ఎం టీచర్ల దంపతుల విగ్రహాలను ఫాదర్ మేల్కీ ఇయర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేలాదిమంది విద్యార్థులతో పాటు తమ కుటుంబ సభ్యుల ఉన్నతికి వారు చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని చార్లెస్ జేసు కరుణ కుటుంబ సభ్యులు అన్నారు.

పాఠశాలలో 50 రోజులుగా శుభదిన్ భోజనం



అన్నేవారిగూడెంలో విద్యార్థులకు నేతి హల్వాను వడ్డిస్తున్న హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్

భీమడోలు: అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో చేపట్టిన శుభదిన్ భోజనం కార్యక్రమం మంగళవారం 50వ రోజుకు చేరింది. 122 మంది విద్యార్థులకు ఎండీఎం ఆహారానికి తోడుగా పూళ్ల గ్రామానికి చెందిన షేక్ సాజిద్ సమకూర్చిన నేతి హల్వాను వడ్డించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఈ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో దాతల సహకారంతో మరిన్ని రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం దాతల ఆర్థిక సాయంతో 50 రోజులుగా 1నుంచి 8వ తరగతి వరకు ప్రతి రోజూ ఎండీఎం భోజనంలో అదనంగా వివిధ రకాల స్వీట్లు, చికెన్ బిర్యానీ వడ్డిస్తున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమం గతేడాది జులై 27న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆ రోజు మాత్రమే దాతల ఆర్థిక సాయంతో విద్యార్థులకు విందు భోజనాలు వడ్డించారు. అన్నేవారిగూడెం పాఠశాలలోని హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ గ్రామం, మండల, జిల్లా, ఇతర ప్రాంతాల్లోని స్నేహితులు, పరిచయస్తుల సహకారంతో విద్యార్థులకు రుచికరమైన స్వీట్లు, బిర్యానీ అందించేందుకు కృషి చేస్తున్నారు. దీనితో విద్యార్థులకు 50 రోజులుగా మధ్యాహ్న భోజనంలో వివిధ ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు.ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, విజయకుమారి, జ్యోతిబస్, దుర్గాప్రసాదిని, ఝాన్సీ, రవిభారతి, శారారాణి తదితరులు ఉన్నారు.

పౌరులందరూ చట్టానికి లోబడి జీవించాలి



దుగ్గిరాల విన్సెంట్ డీపాల్ కళాశాలలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి : ప్రతి పౌరుడు చట్టానికి లోబడి నడుచుకోవాలని, ప్రజలకు చట్టాలపై అవగాహన పెంపొందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ముఖ్య ఉద్దేశమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (యఫ్.ఎ.సి) ఎం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ దుగ్గిరాలలోని సెయింట్ విన్సెంట్ డిపాల్ డిగ్రీ కాలేజీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. రవాణా శాఖ అధికారి కె కృష్ణారావు మాట్లాడుతూ వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ పొందటానికి అర్హులని తెలిపారు. ఏలూరు మూడవ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబు, ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్లో మాట్లాడుతున్నారని, ఇది ప్రమాదాలకు ఒక ముఖ్య కారణమవుతోందని తెలిపారు. వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సెయింట్ విన్సెంట్ డిపోల్ కాలేజ్ ప్రిన్సిపల్ రోబిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



కొత్తగూడెంలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

ఉంగుటూరు: చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలో కొత్తగూడెం, పట్టంపాడులో డ్రైడే ఫ్రైడే శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమ కుట్టరాదు, దోమ పుట్టరాదు అనే నినాదంతో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అందరూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఫ్రై డే, డ్రై డే పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టే వచ్చునని పిలుపునిచ్చారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యతపై అవగాన కల్పించారు. ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రాణాంతక వ్యాధులను వ్యాపింపజేసే దోమలు వ్యాప్తిని అరికట్టవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి.కె.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమారి, ఆశా కార్యకర్తలు వెంకటరమణ పాల్గొన్నారు.

ఫర్నిచర్ షాపులపై కేసులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని పలు ఫర్నిచర్, పరుపుల షాపుల్లో విజిలెన్స్, తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఫర్నిచర్ షాపుల్లో తయారీ తేదీ, తయారీదారుని చిరునామా, గరిష్ట చిల్లర ధర, వినియోగదారు సేవ ఫోన్ నంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్న, స్థానికంగా తయారు చేస్తున్న పరుపులు, దిండ్లు వంటి వాటిని గుర్తించారు. ఈ షాపులపై మొత్తం 5 కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై కె.సీతారాము, తూనికలు కొలతల అధికారి, వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

గుండె పోటుతో కూలీ మృతి

ఏలూరు (టూటౌన్): వలస కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక జన్మభూమి పార్క్ వెనుక ఉన్న తమ్మిలేరు కాలువలోని గుర్రపు డెక్కను కొందరు కూలీలు తొలగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఉంగ్రాజువరం మండలం వడ్లూరుకి చెందిన ఎం సూర్యారావు (60) ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. దీనిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యారావు నాలుగు రోజులుగా ఏలూరు వచ్చి పనిచేస్తున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి



భీమడోలులో జ్ఞాన జ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, డీఆర్‌పీలు

భీమడోలు: అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ సిబ్బంది తమ వంతు కృషి చేయాలని భీమడోలు క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ బి.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వారం రోజుల పాటు కొనసాగే జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో నూతనంగా అమలు చేయనున్న ఫౌండేషన్ పాఠశాలలకు అనుబంధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూలు చిన్నారులు నమోదై ఉంటారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సంయుక్తంగా చేపట్టి విజయవంతం చేయాలని సూచించారు. డీఆర్‌పీలు ఎం.శరీన్, నాగేశ్వరరావు, గోపాలకృష్ణ విద్యా సంబంధ విషయాలపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్‌కే నూర్జహాన్, కవిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: అంగన్‌వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు మీరాకుమారి మంగళవారం ఉంగుటూరులోని హైస్కూల్లో ప్రారంభించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి–1 ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లందరూ శిక్షణలోని అంశాలను శ్రద్ధగా నేర్చుకుని తరగతి గదిలో అమలు చేయాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం పరిశీలకురాలుగా షేక్ ఫరిదా, జిల్లా ఆర్పీలుగా అల్లు శ్రీను, సిరికి శివ, శివకుమార్, బి.శ్రీలక్ష్మి, డి.శారదామణి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్‌టీ నాగేంద్ర, విష్ణు, నారాయణ, రవికిశోర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు

దెందులూరు: జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించాలని పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం దెందులూరు ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను సూపర్‌వైజర్లు చిట్టెమ్మ శ్రీదేవి పద్మభూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద ఈ శిబిరాన్ని పరిశీలించారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధనపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు.

పేకాట శిబిరంపై మెరుపు దాడి

పెదవేగి : పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపుడిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేయగా ఘటనా స్థలంలో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారివద్ద నుంచి 4 మోటారు సైకిళ్లు, రూ.26,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులని క్రమబద్ధీకరించి, వారికి ఉద్యోగ, వేతన భద్రత కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ సభ్యులు దొడ్డిగర్ల నాగబాబు, యలగాడ శివ కుమార్, దుర్గారావు, మరియదాసు, ప్రసాద్, నాగబాబు, కిషోర్, సతీష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక సేవలు



ఆసుపత్రిలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్ సుందర్‌బాబు

దెందులూరు: దివ్యాంగులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నట్టు ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ సభ్యులు తెలిపారు. ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం మంగళవారం అంతర్జాతీయ ఆస్పెర్జర్స్ డే సందర్భంగా అవగాహన సదస్సును దెందులూరు సీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ బంక సుందర్‌బాబు మాట్లాడుతూ ఆస్పెర్జర్స్ డే సిండ్రోమ్ అనేది ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌కు ఒక రూపం అన్నారు. ఈ వైకల్యం కలిగిన వారు హాస్యం, వ్యగ్యం, శారీరక అభినయాలను అర్థం చేసుకోలేరని తెలిపారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాసన కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆడియోలజీ, కృత్రిమ అవయవాలు సేవలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పునరావాస కేంద్ర సిబ్బంది, వైద్య సిబ్బంది ఉన్నారు.

23 నుంచి గంగానమ్మ జాతర

పెదవేగి : గంగానమ్మ జాతరను గ్రామస్తులు శాంతియుతంగా ఆధ్యాత్మిక చింతనతో నిర్వహించుకోవాలని, ఎటువంటి గొడవలు సృష్టించకుండా పోలీసు వారికి సహకరించాలని పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు అన్నారు. సీఐ మంగళవారం పెదవేగి మండలం కూచింపూడిలో గ్రామసభ నిర్వహించిన స్థానికులతో జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఈనెల 23 నుంచి గంగానమ్మ జాతర మహోత్సవం ప్రారంభమవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి ట్రాఫిక్ మళ్లిస్తామని సీఐ తెలిపారు. గ్రామంలో వాహనాల కోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట పెదవేగి ఎస్సై కె రామకృష్ణ ఉన్నారు.

కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): మృతి చెందిన ఉపాధి హామీ కూలీ కుటుంబాన్ని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొయ్యలగూడెం మండలం కుంతలగూడెం పంచాయతీ పరిధిలో ఉపాధి పని చేస్తున్న కూలీలపై ట్రాక్టర్ దూసుకురావడంతో అక్కడికక్కడే అల్లే భాగ్యవతి అనే మహిళ మృతి చెందిందన్నారు. మరి కొందరు గాయపడినట్టు తెలిపారు. భాగ్యవతి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల వద్ద ప్రాథమిక వైద్యానికి సంబంధించిన సౌకర్యాలు కల్పించాలని రవి కోరారు.

సౌకర్యాలు కల్పించాలి

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చనిపోతున్న ఉపాధి కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ మంగళవారం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇప్పటికే జిల్లాలో కొయ్యలగూడెం మండలంలో ఉపాధి హామీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఎంపీడీఓ) అదనపు ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఏపీఓ) పట్టించుకోకపోవడం వల్లే ఒక ఉపాధి కూలీ చనిపోయాడని తెలిపింది. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు మండలాల్లో కూలీలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని పేర్కొంది. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.